అప్పన్నను దర్శించుకున్న ఎన్నికల అబ్జర్వర్

విశాలాంధ్ర-సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి వారిని విశాఖ నగర అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల అబ్జర్వర్ అమిత్ శర్మ ఐ.ఏ.ఎస్ దర్శించుకున్నారు. సహాయ కార్యనిర్వహణాధికారి ఆనంద్ కుమార్, పర్యవేక్షణాధికారి శ్రీనివాసరావు పూలమాల వేసి ఘన స్వాగతం పలికారు. తొలుత ఆయన కప్ప స్తంభం ఆలింగనం చేసుకుని, బేడా ప్రదక్షిణ చేశారు. ఏఈఓ స్వామివారి శేష వస్త్రంతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. విశాఖ ఈస్ట్, వెస్ట్, సౌత్, నార్త్ నియోజకవర్గాల అబ్జర్వర్. పిదప ఈఓ శ్రీనివాసమూర్తి, ఏసిపి అన్నేపు నరసింహ మూర్తి బృందం మే 10న ఏర్పాట్లను కొండపై ఆయా ప్రదేశాల్లో పలు అంశాలపై చర్చించుకున్నారు.

ఇండియా కూటమి అభ్యర్థులనే గెలిపించండి

విశాలాంధ్ర - గాజువాక: మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ఇండియా కూటమి బలపరచిన అభ్యర్థులనే గెలిపించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సి.హెచ్.నర్సింగరావు విజ్ఞప్తి చేసారు. గురువారం గాజువాకలోని ఒక హోటల్‌లో ఇండియా కూటమి ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశానికి నర్సింగరావు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. 2024 ఎన్నికల్లో నరేంద్ర మోడీ గెలిస్తే ప్రజాస్వామ్యం ఇబ్బందుల్లో పడుతుందని అన్నారు. హిందువులను అడ్డు పెట్టుకొని బిజెపి రాజకీయాలను చేస్తుందని అన్నారు. సర్వ సంపదను సృష్టించే పరిశ్రమలను నిర్వీర్యం చేస్తున్నారని అన్నారు. బిజెపి అభ్యర్థులు సి.ఎం రమేష్, సుజనా చౌదరి పెద్ద మాఫీయా డాన్‌లని అన్నారు. మోది అధికారంలోకి వచ్చిన ఈ పదేళ్లలో గ్యాస్ ధర రూ. 400 నుంచి 1100 పెరిగిందని అన్నారు. నరేంద్ర మోది ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఇండియా కూటమి ఏర్పడిందని అన్నారు. ఇండియా కూటమి బలపరచిన అభ్యర్థులనే గెలి పించాలని కోరారు. సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు ఏ.జె.స్టాలిన్ సమావేశానికి అధ్యక్షత వహించి మాట్లాడుతూ నరేంద్ర మోది ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఇండియా కూటమి బలపరచిన అభ్యర్థుల గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. ఈ సమావేశంలో విశాఖ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పి.సత్యా రెడ్డి, గాజువాక నియోజక వర్గ సిపిఎం ఎమ్మెల్యే అభ్యర్థి ఎం.జగ్గు నాయుడు, కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి జెరిపోతుల ముత్యాలు, ఆఫ్ రాష్ట్ర అధ్యక్షులు సీరం రమేష్, 78వ వార్డు కార్పొరేటర్ బి.గంగారాం, గాజువాక డివిజన్ కార్యదర్శి ఎం.రాంబాబు, సీఐటీయూ నాయకులు జె.అయోధ్య రాము, సీపీఐ నాయకులు కసిరెడ్డి సత్యనారాయణ, జి.ఆనంద్, జె.రామకృష్ణ, విష్ణుమూర్తి, పి.దుర్గారావు, అచ్యుత రావు , కాంగ్రెస్ పార్టీ నాయకులు స్వర్ణ, బి.వేణు వర్మ, రమణతో పాటు నాయకులు పాల్గొన్నారు.

ఇండియా కూటమి అభ్యర్థి
విమలను గెలిపించుకుందాం

విశాలాంధ్ర - మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతం పరిధి 58వ వార్డు రాంనగర్, గొల్లల పాలెంలలో ఇండియా కూటమి పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి విమలను గెలిపించాలని గురువారం ఇంటింటి ప్రచారాన్ని చేపట్టారు. ఇండియా కూటమి పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి విమలను గెలిపించాలని ఇంటింటికి ప్రచారాన్ని చేపట్టి ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడి రాజు, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు చలసాని రాఘవేంద్రరావు, కే.సత్యాంజనేయ, బేగం, జెవి ప్రభాకర్, జి. ఆనంద్, జి.రాంబాబు, సబ్బవరపు శ్రీను, రమణ, ఇచ్ఛాపురం యెర్రయ్య, డి. నూక రాజు, పి.దుర్గారావు, పిల్లా సూర్య పద్మ, జి.జయ పాల్గొన్నారు.

ఆశీర్వదించండి అండగా ఉంటా...
23వ వార్డు ప్రియదర్శిని కాలనీలో కె.కె.రాజు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: వైసీపీ విశాఖ ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు 23వ వార్డులో స్థానిక పెద్దలతో కలిసి ప్రియదర్శిని కాలనీ, తదితర ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం స్థానిక పెద్దలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గత ఐదు సంవత్సరాలలో ఈ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన నాటి నుండి ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రతి ఒక్కరి సంక్షేమానికి అనేక రకరకాల పథకాలను ప్రవేశపెట్టి నమ్మకాన్ని నిలబెట్టుకున్నారని కావున ఎన్నికల్లో మమ్మల్ని ఆశీర్వదించి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మొల్లి అప్పారావు, సాడి పద్మారెడ్డి, బాక్సర్ రాజు, అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తర కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా లక్కరాజు రామారావు నామినేషన్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: కాంగ్రెస్ పార్టీ ఉత్తర నియోజకవర్గం అభ్యర్థిగా లక్కరాజు రామారావు నామినేషన్ ఉత్సాహభరితంగా సాగింది. గురువారం ఉదయం మురళి నగర్ వైభవ వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద నుండి కాంగ్రెస్ అభ్యర్థిగా లక్కరాజు రామారావు పార్టీ శ్రేణులతో కలిసి వందలాది ద్విచక్ర వాహనాలతో ర్యాలీగా బయలుదేరి తాటిచెట్లపాలెం, గురుద్వార్ మీదుగా దారి పొడవునా హస్తం గుర్తుకే ఓటు వేయాలని నినాదాలు చేసుకుంటూ సీతమ్మధార అర్బన్ తహశీల్దార్ కార్యాలయానికి చేరుకుని నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా రామారావు మీడియాతో మాట్లాడుతూ సుదీర్ఘ చరిత్ర కలిగిన కాంగ్రెస్ పార్టీ ఎన్నో గెలుపోటములు చూసిందని అన్నారు. కేంద్రంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ గెలిస్తే రాష్ట్రానికి ప్రత్యేక హోదా తీసుకొస్తామని అన్నారు. వైసిపి ప్రభుత్వం పాలనలో విఫలం అయిందని అన్నారు. కాంగ్రెస్ పార్టీతోనే రాష్ట్రం పురోభివృద్ధి చెందుతుందని చెప్పారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదాతో పాటు విభజన హామీల సాధన కోసం ఇండియా కూటమి బలపరిచిన కాంగ్రెస్ అభ్యర్థిగా తాను పోటీ చేస్తున్నానని, తనను గెలిపించాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

ఆఖరి రోజు విశాఖ పార్లమెంటుకు 12 నామినేషన్లు
ఎనిమిది మంది స్వతంత్ర అభ్యర్థులే..

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు నామినేషన్ల ఘట్టం పూర్తయింది. ఆఖరి రోజు గురువారం విశాఖ పార్లమెంటు స్థానానికి 12 నామినేషన్లు దాఖలయ్యాయి. అందులో ఎనిమిది మంది స్వతంత్ర అభ్యర్థులు ఉండగా మిగిలిన వారు వివిధ పార్టీల నుంచి ప్రాతినిధ్యం వహించిన వారున్నారు. వారంతా విశాఖ పార్లమెంటు రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో సంబంధిత పత్రాలను అందజేశారు. వారి నుంచి జిల్లా కలెక్టర్, రిటర్నింగ్ అధికారి డా.ఎ. మల్లిఖార్జున నామినేషన్ పత్రాలను స్వీకరించి ప్రతిజ్ఞ చేయించారు. రాడికల్ పార్టీ నుంచి దేవర శంకర్, నవరంగ్ కాంగ్రెస్ పార్టీ నుంచి బిక్కవోలు చలమాజీ రావు, జై భీమ్ రావు భారత్ పార్టీ నుంచి నక్క నమ్మి గ్రేస్, ఇండియా ప్రజా బంధు పార్టీ నుంచి అందుకూరి విజయభాస్కర్, స్వతంత్ర అభ్యర్థులుగా పట్టపగలు రాజా రమేష్, వియ్యపు గంగరాజు, మెహబూబ్ సుభాన్, కొల్లి నాగరాజు, లగుడు గోవిందరావు, వాసుపల్లి సురేష్, పొన్నాడ జనార్దన్, పిడిది అప్పారావు నామినేషన్లు దాఖలు చేశారు.

కూటమి గెలుపు ఖాయం: పల్లా శ్రీనివాస్

విశాలాంధ్ర - గాజువాక: ఈసారి ఎన్నికల్లో గాజువాక నియోజకవర్గంలో కూటమి గెలుపును ఎవరూ ఆపలేరని నియోజకవర్గ ఎన్‌డీఏ కూటమి భ్యర్థి పల్లా శ్రీనివాసరావు అన్నారు. పాత గాజువాక పార్టీ కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ తాను నామినేషన్ కార్యక్రమానికి వెళ్తున్నప్పుడు ప్రజలు స్వచ్ఛందంగా తరలి వచ్చారని వారందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. విశాఖ జిల్లాకు ఏం చేశారని వైసీపీ వాళ్ళు ఓట్లు అడుగుతున్నారని ప్రశ్నించారు. రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారని ఓట్లెయ్యాలా?..లేక ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని ఓట్లెయ్యాలా అని నిలదీశారు. గత ఐదేళ్లలో గాజువాక ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదన్నారు. టీడీపీ హయాంలో అనేక అభివృద్ధి పనులు చేశామని గుర్తు చేశారు. ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా శ్రీభరత్‌ను గెలిపిస్తే ఉక్కును కాపాడుకోవడమే కాకుండా కాలుష్య నివారణ, మత్స్యకారులకు జట్టీ నిర్మాణం, గాజువాకలో ఫ్లై ఓవర్ నిర్మాణం, ఆర్ కార్డుల బదిలీ, ఏపీఐఐసీ భూ నిర్వాసితుల సమస్య వంటివి పరిష్కరిస్తానని చెప్పారు. కార్యక్రమంలో జనసేన పీఏసీ సభ్యుడు కోన తాతారావు, బీజేపీ నాయకులు కృష్ణంరాజు, కార్పొరేటర్లు బొండా జగన్, పల్లా శ్రీనివాస్, మొల్లి ముత్యాల నాయుడు, గంధం వెంకటరావు, మహ్మద్ రఫీ, ప్రకాష్, నియోజకవర్గ సమన్వయ కర్త ప్రసాదుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పంచగ్రామాల భూ సమస్యకు శాశ్వత పరిష్కారం
భీమిలి అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థి గంటా శ్రీనివాసరావు

విశాలాంధ్ర-సింహాచలం: శతాబ్దాల కాలంగా పెండింగ్‌లో ఉన్న సింహాచలం పంచగ్రామాల భూ సమస్యకు రాబోయే కూటమి ప్రభుత్వంలో శాశ్వత పరిష్కారం తీసుకువస్తామని భీమిలి అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థి గంటా శ్రీనివాసరావు చెప్పారు. భూ సమస్య కారణంగా వేలాది మంది ఇళ్లు మరమ్మతులు చేసుకోలేక, క్రయ విక్రయాలు చేయలేక పడుతున్న ఇబ్బందులు తనకు తెలుసునని అన్నారు. ఈ విషయం తన మేనిఫెస్టోలో అత్యంత ప్రాధాన్యాంశమని వెల్లడించారు. సింహాచలంలోని పాత అడివివరం, విజినిగిరిపాలెం, లండగరువు గ్రామాలకు చెందిన పలువురు రైతులు తమ కుటుంబాలతో సహా బుధవారం టీడీపీలో చేరారు. వారందరికీ గంటా శ్రీనివాసరావు పసుపు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వైసీపీ ప్రభుత్వం సమస్యకు పరిష్కారం చూపించడంలో ఘోరంగా విఫలమైందని ఆయన చెప్పారు. 98వ వార్డు కార్పొరేటర్ పిసిని వరాహ నరసింహం ఆధ్వర్యంలో లండ పెద్ద శ్రీను, మజ్జి కోటేశ్వరరావు, లండ వెంకట్రావు, మజ్జి అప్పలనాయుడు సహా పలువురు గంటాకు భూ సమస్యపై వివరించారు. కార్యక్రమంలో 98వ వార్డు అధ్యక్షుడు పంచదార్ల శ్రీనివాస్, జిల్లా టీడీపీ కార్యదర్శి లండ శ్రీనివాస్, 98వ వార్డు టీడీపీ కార్యదర్శి బంటుబిల్లి వరాహ నరసింహం తదితరులు పాల్గొన్నారు.

మర్రిపాలెంలో సీపీఐ ఇంటింటి ప్రచారం

విశాలాంధ్ర - విశాఖ: విశాఖ పశ్చిమ శాసనసభ నియోజకవర్గం సీపీఐ అభ్యర్థి అత్తిలి విమలకు మద్దతుగా గురువారం మర్రిపాలెం పీఎఫ్ కార్యాలయం కాలనీ, శాంతి నగర్ తదితర ప్రాంతాల్లో సీపీఐ విశాఖ జిల్లా కార్యవర్గ సభ్యుడు పి.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ విషయంలో బిజెపి దొంగాట ఆడుతూ ప్రజలను మభ్యపెడుతోందని చంద్రశేఖర్ విమర్శించారు. బీజేపీ అనుసరిస్తున్న ప్రైవేటీకరణ విధానాలకు వైసీపీ పరోక్ష మద్దతు ప్రకటిస్తోందని అన్నారు. మరోపక్క ప్రధాన ప్రతిపక్షమైన టీడీపీ కూడా బీజేపీకి అనుకూలంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఈ నేపథ్యంలో రానున్న ఎన్నికల్లో ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ, ఏఐఎస్ఎఫ్ నాయకులు క్షేత్రపాల్, నాగభూషణరావు, నాగరాజు శ్రీనివాస్, గణేష్, భాను, జ్యోతి, దుర్గాప్రసాద్, జాయ్ తదితరులు పాల్గొన్నారు.

నిజాయితీపరులకే ఓటెయ్యండి

గెలిపిస్తే ఉత్తరాన్ని ఉత్తమ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా..
జై భారత్ నేషనల్ పార్టీ అభ్యర్థి లక్ష్మీనారాయణ

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: జై భారత్ నేషనల్ పార్టీ అధ్యక్షులు, విశాఖ ఉత్తర నియోజకవర్గం అసెంబ్లీ అభ్యర్థిగా గురువారం సీతమ్మధారలో ప్రజలతో పాదయాత్రగా వచ్చి నామినేషన్ వేశారు. జై భారత్ నేషనల్ పార్టీ కార్యాలయం నుండి ర్యాలీగా లక్ష్మీనారాయణ సాయిబాబా గుడి మీదగా సీతమ్మధార తహశీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. వివిధ సంస్కృతిక కార్యక్రమాలు, కోలాటాలు మధ్య ఉత్సాహపరితంగా నామినేషన్ కార్యక్రమం జరిగింది. ఉత్తర నియోజకవర్గంను ఉత్తమ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని నిజాయితీకే పట్టం కట్టాలని ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మీడియాకు తెలిపారు. నామినేషన్ వేసి బయటకు రాగానే విశాఖ స్టీల్‌ప్లాంట్ విషయంలో హైకోర్టు స్టేటస్ కో ఇచ్చిందన్నారు. 2024 జూన్‌లో కోర్టు తిరిగి తెరవబడే వరకు స్టీల్‌ప్లాంట్‌ను విక్రయించడం లేదని అదనపు సొలిసిటర్ జనరల్ కోర్టుకు తెలియజేశారన్నారు. ఒక స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం పోరాటం చేసే వారిని గెలిపించాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. యథాతథ స్థితిని పాటించాలని యూనియన్ ఆఫ్ ఇండియాను కోర్టు ఆదేశిస్తూ ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జూన్ 19కి వాయిదా వేసిందన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చెయ్యనివ్వను అంటూ ఆధారాలతో ఇప్పటికే హైకోర్టులో జేడి లక్ష్మీనారాయణ పిల్ వేసిన సంగతి అందరికి తెలిసిందే అన్నారు. ఇప్పుడు హైకోర్టు ఇచ్చిన స్టేటస్ కో లక్ష్మీనారాయణ రాజకీయ తొలివిజయంగా అభిమానులు భావిస్తున్నారు. న్యాయవాది యలమంజుల బాలాజీ , లక్ష్మీనారాయణ దాఖలు చేసిన పిల్‌పై ఈ కేసును వాదించారు.

మే 1న ఎన్నికల భారతం పుస్తకావిష్కరణ



విశాలాంధ్ర - విశాఖ: వచ్చే నెల ఒకటవ తేదీన సాయంత్రం ఆరు గంటలకు విశాఖపట్నం ద్వారకానగర్ లోని పౌర గ్రంథాలయంలో 'ఎన్నికల భారతం' కవితా సంకలనం ఆవిష్కరణ సభ నిర్వహించనున్నట్లు అరసం విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పల అప్పలరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. క్విమేడ్ వై.విజయకుమార్ మార్క్సిస్టు అధ్యయన కేంద్రం కన్వీనర్ జెవి సత్యనారాయణ మూర్తి ఈ సభకు ముఖ్య అతిథిగా హాజరై పుస్తకావిష్కరణ చేస్తారని తెలిపారు. అరసం రాష్ట్ర కమిటీ నిర్వహించిన కవితల పోటీల్లో విజేతలకు బహుమతి ప్రదానం చేస్తారని చెప్పారు. అరసం రాష్ట్ర కార్యదర్శి ఉప్పల అప్పలరాజు సభకు అధ్యక్షతవహిస్తారు. అనంతరం కవి సమ్మేళనం జరుగు తుందని, అరసం విశాఖ శాఖ ఉపాధ్యక్షుడు ఎస్.హనుమంతరావు నిర్వహణలో జరిగే కవి సమ్మేళనంలో విజేతలైన కవులతోపాటు నగరంలోని కవులు బొడ్డ కూర్మారావు, రెడ్డి రామక్రిష్ణ, చొక్కర తాతారావు, పొలమరశెట్టి ఫ్రాన్సిస్, నాస్తిక్ పతివాడ, సిహెచ్ చినసూర్యనారాయణ, పిఎల్‌వి ప్రసాద్, మోకారతన్ రాజు, డాక్టర్ బండి సత్యనారాయణ, డాక్టర్ కెవిఎస్ మూర్తి, స్వర్ణ శైలజ తదితరులు పాల్గొంటారని తెలిపారు. ఈ సభకు డాక్టర్ సిఎస్ క్షేత్రపాల్ రెడ్డి ఆహ్వానం పలుకుతారన్నారు. ఈ సాహితీ సమావేశంలో నగరంలోని కవులు, కళాకారులు పాల్గొని జయప్రదం చేయవలసిందిగా కోరారు.

రూ.3800 కోట్ల అభివృద్ధితో చరిత్ర సృష్టించాం

భీమిలి అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థి గంటా

విశాలాంధ్ర - ఆనందపురం: టీడీపీ హయాంలో జరిగిన అభివృద్ధిని, సంక్షేమాన్ని పోల్చి చూసుకుంటే ఎవరివి మాటలో ఎవరివి చేతలో తెలిసిపోతుందని భీమిలి అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థి గంటా శ్రీనివాసరావు చెప్పారు. 2014-19 మధ్యలో రూ.3,800 కోట్లతో భీమిలి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశానని, ప్రతి గ్రామంలో దాని ఆనవాళ్లు కనబడతాయని తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం మామిడిలోవ, శొంట్యాం, కణమాం ప్రాంతాల్లో పర్యటించిన సందర్భంగా మాట్లాడుతూ ఒక్క మామిడిలోవ పంచాయతీలోనే రూ.6.5 కోట్ల అభివృద్ధి పనులు చేశామని, అందుకే ఊహించని రీతిలో పూలవర్షం కురిపిస్తూ ఘన స్వాగతం పలికారన్నారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో నిలిచిపోయిన అభివృద్ధిని జెట్ స్పీడ్‌లో పరుగుతీయిస్తానని ప్రకటించారు. టిడిపి అధికారంలోకి వస్తే సంక్షేమ కార్యక్రమాలు ఆగిపోతాయని జగన్మోహన్ రెడ్డి చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. సంక్షేమ పథకాలను తానే కనిపెట్టినట్టు సీఎం బిల్డప్ ఇస్తున్నారని, సంక్షేమ పథకాలకు నాంది పలికిందే అన్న ఎన్టీఆర్ అనే విషయం గుర్తెరగాలన్నారు. జగన్మోహన్ రెడ్డిలా సంక్షేమ పథకాలను కోత కోసి ఇవ్వడం టిడిపికి అలవాటు లేదని, చెప్పింది చెప్పినట్టు అందజేస్తామని గంటా తెలిపారు. మహిళల ఆర్థిక స్వావలంబన కోసం చంద్రబాబు నాయుడు డ్వాక్రా రూపకల్పన చేశారన్నారు. మద్య నిషేధం పేరుతో దగా చేసిన జగన్మోహన్ రెడ్డిని మహిళాలోకం నిలదీయాలని చెప్పారు. కార్యక్రమంలో టిడిపి ఇన్‌చార్జి కోరాడ రాజబాబు, జనసేన నాయకులు శాఖరి శ్రీనుబాబు, బీజేపీ ఇన్‌చార్జి రామానాయుడు, ఘట్టమనేని బోస్, చంటి పాల్గొన్నారు.

గంగవరం పోర్ట్ కార్మికులకు ఇచ్చిన నోటీసులు వెనక్కు తీసుకోవాలి



విశాలాంధ్ర - పెదగంట్యాడ: గంగవరం పోర్టు కార్మికులకు విశాఖ పోర్టుతో సమానంగా వేతనాలను పెంచాలని కోరుతూ జరుగుతున్న ఆందోళన 15వ రోజు కొనసాగింది. ఈ సందర్భంగా కార్మికుల ఉద్దేశించి గంగవరం పోర్ట్ ఎంప్లాయిస్ యూనియన్ ఉపాధ్యక్షులు కొవిరి అప్పలరాజు మాట్లాడారు. యాజమాన్యం నిర్వాసిత కార్మికులకు మినహా మిగతా కార్మికులందరికీ వ్యక్తిగత నోటీసులు పంపించిందని దీనిలో కార్మికులను బెదిరింపులకు పాల్పడుతుందని అన్నారు. ఎటువంటి ముందస్తు నోటీస్ ఇవ్వకుండా మెరుపు సమ్మె చేశారని యాజమాన్యం చెప్పడం సిగ్గుచేటు అన్నారు. అధాని యాజమాన్యం వచ్చినప్పటి నుంచి పలు దఫాలు కార్మికులు తమ సమస్యలు రిప్రజెంటేషన్ ఇస్తామంటే తీసుకున్న సందర్భమే లేదన్నారు. అనేక సందర్భాల్లో యాజమాన్యం రిప్రజెంటేషన్ తీసుకోకపోతే నోటీసు బోర్డులో అతికించామన్నారు. ఈ యాజమాన్యానికి కార్మికుల యొక్క సమస్యలు వినడం గాని వారు వినతి పత్రం తీసుకోవడం గానీ చర్చల ద్వారా సమస్య పరిష్కరించడం అలవాటు లేదన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి నొల్లి తాతారావు, గంటిపల్లి అమ్మోరు, సత్యానందం, స్వామి ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పెంటమాంబ ఆలయ కమిటీ నూతన డైరెక్టర్‌గా యేల్లేటి శ్రీను

విశాలాంధ్ర - పెదగంట్యాడ: శ్రీ పెంటమాంబ ఆలయ కమిటీ నూతన డైరెక్టర్‌గా యేల్లేటి శ్రీనివాసరావు నియమితులైనట్లు నెల్లిముక్కు గ్రామ పంచాయతీ పెద్దలు, పూర్వపు డైరెక్టర్లు గోందేశీ మహేష్ రెడ్డి, పులి రమణ రెడ్డి, గోందేశీ అప్పల రెడ్డి, సత్యారావులు తెలియజేశారు. శ్రీనివాస్‌తో పాటు మొల్లి రమణ, గంట్యాడ పైడిరాజులను కమిటీ డైరెక్టర్లుగా తీసుకొన్నామని గురువారం ఆలయ కమిటీ ఆవరణలో జరిగిన విలేకరుల సమావేశంలో తెలిపారు. పంచాయతీలోని గ్రామాల్లో అన్ని సామజిక వర్గాల నుండి కమిటీ ప్రతినిధులుగా తీసుకుని ఐకమత్యంగా అమ్మవారికి సేవలు చేస్తామని తెలిపారు.

వైసీపీకే హోటల్ మర్చంట్ అసోసియేషన్ మద్దతు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: వచ్చే ఎన్నికల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలియజేస్తూ విశాఖ హోటల్ మర్చంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం ద్వారకా నగర్‌లో గల హోటల్ మర్చంట్ అసోసియేషన్ కార్యాలయంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి బొత్స సత్యనారాయణ, ప్రజాప్రతినిధులు, పలు నియోజకవర్గాల ఎమ్మెల్యే అభ్యర్థులతో కలిసి పాల్గొన్న విశాఖ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె రాజు, వైసీపీ విశాఖ అధ్యక్షులు కోలా గురువులు, మాజీ ఎమ్మెల్యే ఎస్కే రహమాన్, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీలోకి భారీ చేరికలు

విశాలాంధ్ర - భీమిలి: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వివక్ష చూపని పాలనకు భీమిలిలో నిరంతరం ప్రజా సమస్యలు పరిష్కారం చేసే అవినీతి లేని అవంతి శ్రీనివాసరావు పాలన నచ్చి 45వ వార్డు సింగాలమ్మ పురం నుంచి అవంతి శ్రీనివాసరావు సమక్షంలో వైసిపి పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. నూతనంగా చేరిన వారు మాట్లాడుతూ జరగబోయే ఎన్నికల్లో భీమిలిలో గంటా శ్రీనివాసరావు టిడిపి తరుపున పోటీ చేస్తుండంతో ఆయన నియోజకవర్గంలో ప్రజలకు గాని సమస్యలు పరిష్కారానికి గాని ఏనాడు మొఖం చూపే దాఖలాలు లేని పరిస్థితి ఉందన్నారు. అంతేకాక ఆయన పాలన అంతా కబ్జాలు మయమన్నారు. ఆయన పాలనలో టిడిపి నాయకులు కార్యకర్తలు మాత్రమే బాగుపడతారన్నారు. ఈ కార్యక్రమంలో 45వ వార్డు వైసిపి శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

బైక్ ర్యాలీ విజయవంతం చేయండి

విశాలాంధ్ర - గోపాలపట్నం/మర్రిపాలెం: గ్రేటర్ విశాఖ కుమారి కళ్యాణ మండపంలో జీవీఎంసీ కోఆప్షన్ మెంబర్ బెహరా భాస్కరరావు ఆధ్వర్యంలో 91, 92 వార్డుల కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్ విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో భాగంగా 26వ తేదీ సాయంత్రం నాలుగు గంటలకు కుమారి కళ్యాణ మండపం నుండి 91, 92 వార్డులలో బైక్ ర్యాలీ నిర్వహించబడుతుందన్నారు. ఈ ర్యాలీలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు, కన్వీనర్లు, బూత్ కమిటీ సభ్యులు, గృహ సారథులు వివిధ అనుబంధ సంస్థల మహిళలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పశ్చిమ నియోజకవర్గ పరిశీలకులు ఎస్ఏ రెహమాన్, పేడాడ రమణి కుమారి, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ గునిశెట్టి శ్రీనివాసరావు, 92వ వార్డు అధ్యక్షులు గొర్లె అప్పలస్వామి నాయుడు, గేదెల మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన పార్టీల అభ్యర్థులను గెలిపిస్తే ఇన్చార్జి పాలన తప్పదు

విశాలాంధ్ర - పద్మనాభం: మండలంలోని గంగవరం, కొవ్వాడ, బిహెచ్ పురం, వికె పాలెం గ్రామాల్లో గురువారం స్వతంత్ర అభ్యర్థి నాగోత నాగమణి ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మన నియోజకవర్గంలో ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థులకు ఓటు వేసి గెలిపిస్తే ఇన్‌చార్జిలు వచ్చి పరిపాలన సాగిస్తారన్నారు. ఇటువంటి పరిపాలన వల్ల అసలు పదవుల్లో ఉన్న ప్రజా నాయకులకు స్థానిక సమస్యలు తెలుసుకోవడం కష్టం అవుతుందన్నారు. దీనివల్ల అభివృద్ధి కుంటుపడుతుందన్నారు.

వైసీపీ అభ్యర్థులను గెలిపించాలి

"విజన్ విశాఖ" కరపత్రాన్ని ఆవిష్కరించిన మంత్రి బొత్స

విశాలాంధ్ర - విశాఖ సిటీ: 2024 సార్వత్రిక ఎన్నికల్లో విశాఖపట్నం వైసిపి పార్లమెంటు అభ్యర్థిగా పోటీ చేస్తున్న బొత్స ఝాన్సీని అలాగే పార్లమెంట్ పరిధిలో ఉన్న వైసిపి శాసనసభ అభ్యర్థులను గెలిపించాలని రాష్ట్ర మంత్రి బొత్స సత్యనారాయణ కోరారు. గురువారం లాసన్స్ బే కాలనీ పార్లమెంట్ ఎన్నికల కార్యాలయంలో మంత్రి బొత్స "విజన్ విశాఖ" కరపత్రాన్ని ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేసే కార్యక్రమానికి విశాఖను ప్రపంచ పటంలో అత్యున్నతంగా నిలిపేందుకు ఐదేళ్ల ఐదు అంశాలతో కూడిన కరపత్రం అనుసంధానత, పారిశ్రామిక కారిడార్, సమగ్ర పట్టణ ప్రణాళికతో మౌలిక సౌకర్యాలు కల్పన, ప్రామాణిక జీవనానికి దీటైన సామాజిక సదుపాయాలు, స్థిర అభివృద్ధికి అనుగుణమైన వాతావరణ సృష్టి అంశాలు పొందుపరిచినట్లు తెలిపారు. అలాగే విశాఖ ప్రగతే లక్ష్యంగా మన విశాఖ ఆడపడుచు డాక్టర్ బొత్స ఝాన్సీ లక్ష్మి విశాఖ పార్లమెంటు అభ్యర్థిగా పోటీ చేస్తున్న కరపత్రం కూడా ఆవిష్కరించారు.

ఇంటింటా కరపత్రాల పంపిణీకై శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పబ్లిసిటీ బృందాన్ని ఉద్దేశించి బొత్స మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవి రెడ్డి, కార్యదర్శి జీవీ కృష్ణారావు, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు కృప జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలన జగనన్నతోనే సాధ్యం...

42వ వార్డు ఎన్నికల ప్రచారంలో "వాసుపల్లి"

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: పేదలకు డిగ్నిటీ, డీసెంట్ లైఫ్ అందిస్తూ పేదరిక నిర్మూలనకి కృషి చేస్తున్న జగన్మోహన్ రెడ్డిని మళ్లీ సీఎంగా చేసుకోవాలని దక్షిణ ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్ కుమార్ అన్నారు. కార్పొరేటర్ ఆళ్ల లీలావతి, ఆళ్ల శ్రీను ఆధ్వర్యంలో 42వ వార్డు లో ఎన్నికల ప్రచారం ఉత్సాహంగా సాగింది. మండుటెండను కూడా లెక్క చేయకుండా జనసంద్రోహం ప్రచారానికి కదిలి వచ్చారు. ప్రతి ఓటర్ ను "వాసుపల్లి" అభ్యర్థిస్తూ 42 వార్డులో రైల్వే న్యూ కాలనీ ఆర్చ్ వినాయక ఆలయం వద్ద పూజలు చేసి కదిలారు. ప్రత్యేకంగా ముస్లింలు వాసువల్లి చేసిన సేవలు ప్లకార్డులతో ప్రదర్శిస్తూ ప్రచారం చేశారు. ముందుగా 42వ వార్డు ఆళ్ల శ్రీను తో కలిసి, వార్డు ఇన్చార్జి సకలబత్తుల ప్రసాద్, వైజాగ్ పటం క్లబ్ పాత్రుడు, డైరెక్టర్ నాగామణి, ఇతర నాయకులు వైసిపి రంగుల భారీ గజమాల తో వాసుపల్లి కి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్కుమార్ మాట్లాడుతూ మాట్లాడుతూ 42 వార్డు వైసీపీ ప్రభుత్వం హయాంలో జరిగిన అభివృద్ధి సంక్షేమం మళ్లీ అందలం ఎక్కిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. వార్డులో ప్రజలనుండి మంచి స్పందన లభిస్తుందని చెప్పారు. కోట్లాది రూపాయలతో పాత పట్టణం ఆధునీకరణ, కొత్త హంగులు పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. మళ్లీ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మిగిలిన పేదలకు ఇల్లు, దక్షిణ పాతపట్టణంకి పూర్తిగా రూపురేఖలు మారుతాయన్నారు. ఎంపీ బొత్స ఝాన్సీ ని, ఎమ్మెల్యేగా తనకి ఫ్యాన్ గుర్తుకే ఓటు వేసి గెలిపించాలనీ వాసుపల్లి కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు వైసిపి నేతలు జయలక్ష్మి, వెన్ని ల వెంకటేష్, గణేష్, చిన్ని, శివ, జయమ్మ, గౌరీ, తదితరులున్నారు.

టీడీపీకి ఓటమి భయం పట్టుకుంది

పశ్చిమ వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదారి ఆనంద్ కుమార్

విశాలాంధ్ర - మర్రిపాలెం : చంద్రబాబు నాయుడు చేస్తున్న మోసాలు వల్ల తెలుగుదేశం పార్టీ నాయకులలో ఓటమి భయం పట్టుకుంటున్నదని జగన్మోహన్ రెడ్డి మళ్ళీ ముఖ్యమంత్రి అవ్వడం తథ్యమని విశాఖ పశ్చిమ నియోజకవర్గం వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదారి ఆనంద్ కుమార్ అన్నారు. జీవీఎంసీ 59వ వార్డు కార్పొరేటర్ పుర్రె పూర్ణ శ్రీ సురేష్, వార్డ్ అధ్యక్షులు రేవల్ల సత్యనారాయణ, విశాఖ పశ్చిమ నియోజకవర్గం ఎన్నికల పరిశీలకులు పిలా ఉమారాణి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం జరిగింది. ముందుగా హిమాచల్ నగర్ నూకాంబిక అమ్మవారు ఆలయంలో అమ్మవారికి పూజలు నిర్వహించారు. అనంతరం లక్ష్మీ నగర్, గణపతి నగర్, ములగాడ హౌసింగ్ కాలనీలలో ప్రచారం చేశారు. ఎన్నికల ప్రచారంలో ప్రధాన రహదారులు జనసంద్రంగా మారాయి. ఆనంద్ కుమార్‌కు స్థానిక ప్రజలు ఘనస్వాగతం పలికారు. పూలదండలు, హారతులతో దీవించారు. దారి పొడుగునా వైసీపీకి అనుకూల నినాదాలతో కార్యకర్తలు వైసిపి జండాలతో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనంద్ కుమార్ మాట్లాడుతూ చంద్ర బాబు నాయుడు మాటలు విని మోసపోవద్దని, టిడిపి నాయకులు ప్రలో భాలకు ప్రజలు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలని కోరారు. రానున్న సార్వత్రిక ఎన్నికలలో విశాఖ పశ్చిమ నియోజకవర్గం వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు, విశాఖ వైసిపి ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ లక్ష్మికి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. 60వ వార్డు కార్పొరేటర్ పివి సురేష్, మండల అధ్యక్షులు అంగా రాంప్రసాద్, కన్నబాబు, 59వ వార్డు వైసిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

స్కూళ్లు, ఇంటర్ కాలేజీలు పక్కాగా వేసవి సెలవులు అమలు చేయాల్సిందే

రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు సీతారాం

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: రాష్ట్రంలోని అన్ని జిల్లాలతోపాటు విశాఖ జిల్లాలోని అన్ని యాజమాన్యాల స్కూళ్లు, ఇంటర్మీడియట్ కళాశాలల విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వ నిబంధనలు మేరకు వేసవి సెలవులు పక్కాగా అమలు చేయడంలో జిల్లాల ఉన్నతాధికారులు శత శాతం చర్యలు చేపట్టాలని ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్టు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం అన్నారు. గురువారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో ఆయన మాట్లాడుతూ 2024-25 విద్యా సంవత్సరంలో పదో తరగతి పరీక్షలు రాయనున్న వారికి అలాగే ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు వ్రాసి రెండో సంవత్సరంలో అడుగిడుతున్న వివిధ కళాశాలల్లో యధేచ్ఛగా విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్టు ఫిర్యాదులు అందుతున్నాయని అన్నారు. ఇది నూటికి నూరుపాళ్లు బాలల హక్కుల ఉల్లంఘనలు క్రిందకు వస్తాయని అన్నారు. అన్ని జిల్లాల విద్యాశాఖాధికారులు, ఆర్ఐఓలు ఇటువంటి స్కూళ్లు, కళాశాలలను గుర్తించేందుకు పర్యవేక్షణా బృందాలు ఏర్పాటు చేయాలని సూచించినట్టు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ నిబంధనలు, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఆదేశాలు పాటించని కళాశాలల గుర్తింపు రద్దుకు సిఫారసులు, అవసరమనుకుంటే వివిధ సెక్షన్ల క్రింద కేసులు నమోదుకు కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు నేతృత్వంలో యావత్ కమిషన్ సర్వం సన్నద్ధంగా ఉందని అన్నారు. ఇటువంటి స్కూళ్లు, కాలేజీలుపై ఫిర్యాదులను apscpcr2018@gmail.comకు అందిస్తే చర్యలకు కమిషన్ సిద్ధంగా ఉన్నట్టు సీతారాం తెలిపారు.

బాపన ముత్యాలమ్మ మహోత్సవంలో "వాసుపల్లి"

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: బాపనముత్యాలమ్మ అమ్మవారి వార్షిక మహోత్సవానికి దక్షిణ నియోజకవర్గం వైసీపీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ హాజరయ్యారు. ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు గురువారం హాజరై అమ్మవారిని దర్శించుకుని అనంతరం అన్నదాన కార్యక్రమంలో భక్తులకు ప్రసాదాన్ని స్వయంగా వడ్డించారు. ముందుగా 37వ వార్డు కార్పొరేటర్ చెన్నా జానకిరామ్, ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు చింతపల్లి వీరన్న, అధ్యక్షులు చిత్తూరు పోలరాజు, కార్యదర్శి సిహెచ్ బాబ్జిలు వాసుపల్లిని సాదరంగా ఆహ్వానించి సత్కరించారు.

మే 10న నేషనల్ టెక్నాలజీ డే

విశాలాంధ్ర -గోపాలపట్నం: గ్రేటర్ విశాఖ స్థానిక ఎన్ఎస్టిఎల్‌లో మే 10న నేషనల్ టెక్నాలజీ డేను నిర్వహించనున్నట్టు సంస్థ తెలిపింది. కార్యక్రమంలో భాగంగా డిగ్రీ పాలిటెక్నిక్ కళాశాలల విద్యార్థులు, పాఠశాల విద్యార్థుల కోసం ఈ క్రింది ఈవెంట్‌లను ఎన్ఎస్టిఎల్ నిర్వహిస్తోంది. ఓపెన్ హౌస్ (ఎన్.ఎస్.టి.ఎల్ ఉత్పత్తుల ప్రదర్శన / ప్రదర్శన), ఎన్.ఎస్.టి.ఎల్ టెక్నాలజీలపై మల్టీమీడియా ప్రదర్శన, మోడల్ / ఎగ్జిబిట్‌లపై పోటీ ఓపెన్ హౌస్, పోటీలలో పాల్గొనడానికి విద్యార్థులను డిప్యూట్ చేయాలని విద్యా సంస్థలు అభ్యర్థించబడ్డాయి. ఓపెన్ హౌస్ సమయంలో, భారతీయ నావికాదళం కోసం సంస్థ అభివృద్ధి చేస్తున్న ఆయుధాలు/వ్యవస్థల ప్రదర్శనలను చూడటానికి విద్యార్థులు అనుమతించ బడతారు. సందర్శన సమయంలో ఎన్.ఎస్.టి.ఎల్ అభివృద్ధి చేసిన సాంకేతికతలకు సంబంధించిన మల్టీమీడియా ప్రదర్శన ప్రదర్శించబడుతుందని కమిటి తెలిపింది. స్కూల్స్ నుండి స్టార్టప్ వరకు: ఇన్నోవేట్ చేయడానికి పూర్తి వివరాల సతీయా కుమార్, సైంటిస్ట్ (0891-2586396), ఆర్ త్రినాథ్, టెక్నికల్ ఆఫీసర్-బి (0891-2586415, 9032322136), గౌరవ ప్రజాపతి, సీనియర్ టెక్నికల్ అసిస్టెంట్-బి (0891-2586221, 8539088872 లను సంప్రదించాలని నిర్వాహకులు తెలిపారు.

జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో ఆకాష్ విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర - విశాఖ సిటీ: జేఈఈ మెయిన్స్ 2024 ఫలితాలలో ఆకాష్ కు చెందిన విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచి 100 శాతం పర్సం టైల్ సాధించి టాప్ ర్యాంకర్లుగా నిలిచారని ఆకాష్ విద్యాసంస్థలు ప్రకటించాయి. జాతీయ స్థాయిలో (ఉమెన్ క్యాటగిరి) టాప్ ర్యాంక్ 1 సాన్వి జైన్ సాధించి ఆకాష్ ప్రతిష్టను ఉన్నత స్థితిలో నిలిపారన్నారు. ఈ సందర్భంగా విశాఖకు చెందిన ఐదుగురు విద్యార్థులు 99 కి పైగా పర్సన్ పర్సం టైల్ సాధించి గుర్తింపు పొందారన్నారు. ఈ మేరకు గురువారం అక్కయ్యపాలెంలో గల ఆకాశ్ విద్యాసంస్థల కార్యాలయంలో విజేతలను ఘనంగా సత్కరించారు. 99.89 పర్సం టైల్ సాధించిన సిద్ధార్థ పటేల్, 99.63 జే సాయి హర్షిత్, 99.5 ఎం లక్ష్మి శృతిక, 99.4 సోమా మిశ్ర, 99.37 వెంకట యషీక్ బోనగిరి ర్యాంకర్లుగా నిలిచారని, వీరితోపాటు అర్జున్ హరి, తనుశ్రీ, సందీప్ కుమార్ వియ్యపు, చైతన్య ఎర్రం రెడ్డి కూడా 98. పైగా పర్సంటేజ్ సాధించారని సంస్థ డిప్యూటీ డైరెక్టర్ ఆర్వీఎస్ నారాయణమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా వారికి మేళతాళాల మధ్య ఊరేగించి ఉత్సాహపూరితమైన వాతావరణంలో మెమెంటోలు, మెడల్స్, పూలమాలలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్లు వై లక్ష్మీనారాయణ, అత్తిలి ఈశ్వర్ ప్రసాద్, బ్రాంచ్ హెడ్ రాజేష్, నిరంజన్ పండా, అకడమిక్ హెడ్స్ సాయికిరణ్, అప్పారావు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. ర్యాంకులు సాధించిన తొమ్మిది మందితో పాటు ఉత్తమ ప్రతిభ కనబరిచిన మొత్తం 25 మందిని ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు తల్లిదండ్రులు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. ఆల్ ఇండియా ఉమెన్ క్యాటగిరిలో ఒకటో ర్యాంక్‌తో పాటు సాయి దివ్య తేజ రెడ్డి 15 ర్యాంకు, రిసీ సుక్ల 19వ ర్యాంకు సాధించి 50 లోపు ర్యాంకులలో తాము మూడు ర్యాంకులను కైవసం చేసుకున్నట్టు వెల్లడించారు. వందలోపు ఎనిమిది ర్యాంకులు 500 లోపు 36 ర్యాంకులు వెయ్యిలో 1000 లోపు 62 ర్యాంకులను సొంతం చేసుకున్నట్టు డిప్యూటీ డైరెక్టర్ ప్రకటించారు.

మలేరియాపై పోరాటాన్ని వేగవంతం చేద్దాం

విశాలాంధ్ర-గోపాలపట్నం: గ్రేటర్ విశాఖ 89, 92, 98 వార్డుల్లో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో, లైబ్రెరీ ల్లో ప్రపంచ మలేరియా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. గ్రామీణ ఆరోగ్య కేంద్రం సింహాచలం డి.సి ఎస్ డాక్టర్ ఎస్.వి.వి.డి రామారెడ్డి ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మరింత మెరుగైన ప్రపంచం కోసం మలేరియా పై పోరాటాన్ని వేగవంతం చేద్దామని, దోమలు చిన్న ప్రాణులు కానీ పెను ప్రమా దకారులు అని, వాటిని తొలిదశలో నిర్మూలించాలని తెలిపారు. ఈ కార్యక్ర మంలో వైద్యాధికారులు డా.అప్పలనాయుడు, డా.సుదర్శనరావు, డా.మాధవి, డా.నీలిమ, హెల్త్ ఎడ్యుకేటరు ఝాన్సీ రాణి, సూపర్వైజర్లు పార్వతీశం, గోపాలకృష్ణ.పి.వి. తదితరులు పాల్గొన్నారు.

పెంటమాంబ అమ్మవారి పండగకు ఏర్పాట్లు పూర్తి

విశాలాంధ్ర - పెదగంట్యాడ: ఈ నెల 29వ తేదీ సోమవారం జరగనున్న శ్రీ పెంటమాంబ ఆలయ వార్షికోత్సవం, అనుపు కార్యక్రమం ఘనంగా జరదానికి ఆలయ కమిటీ ప్రతినిధులు, గ్రామ పెద్దలు విస్తృత ఏర్పాట్లు పూర్తి చేసారు. ఈ సందర్భంగా డైరెక్టర్లు గోందేశీ అప్పల రెడ్డి, పులి రమణారెడ్డి, గొందేమి మహేష్‌రెడ్డి, సత్యరావులు మాట్లాడుతూ నెల్లిముక్కు గ్రామపంచాయతీ ప్రజల ఆరాధ్య దైవం శ్రీ పెంటమాంబ అమ్మవారి పండగ 14 గ్రామాల ప్రజలు అత్యంత వైభవంగా నిర్వహిస్తారని ఈ సంవత్సరం కూడా ఈ ప్రాంత ప్రజల సహకారంతో ఘనంగా నిర్వహిస్తామన్నారు. ఉత్తరాంధ్రలోనే పేరు గాంచిన పెంటమాంబ అమ్మవారి పండగలో భక్తులు పాల్గొని అమ్మవారి ఆశీర్వాదాలు అందుకోవాలన్నారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో పులి రాము, పులి రాజా, పిట్ట బాంబు, పెంటరావు, ధర్మాల రామిరెడ్డి, ముద్దుర్తి శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీలోకి పలువురు నాయకులు

- కండువా కప్పి ఆహ్వానించిన మంత్రి అమర్నాథ్

విశాలాంధ్ర - గాజువాక: తెలుగుదేశం పార్టీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు 73 వ వార్డు కార్పొరేటర్ భూపతిరాజు సుజాత ఆధ్వర్యంలో రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి, గాజువాక అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గుడివాడ అమర్నాథ్ సమక్షంలో గురువారం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. జగన్మోహన్ రెడ్డి అందిస్తున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను, పార్టీ నాయకులకు కార్యకర్తలకు ఆయన ఇస్తున్న నమ్మకాన్ని, ధైర్యాన్ని చూసి తామంతా వైసిపిలో చేరుతున్నామని చెప్పుకొచ్చారు. ఈ సందర్భంగా అమర్నాథ్ మాట్లాడుతూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ క్యాడర్ను పార్టీ అధిష్టానం ఎప్పుడూ విస్మరించిందని వారికి కష్టసుఖాల గురించి ఆలోచిస్తుందని చెప్పారు. వైసిపిలో ఉన్న నాయకులకు, కార్యకర్తలకు సమాజంలో గౌరవ మర్యాదలు ఉంటాయని ఆయన తెలియజేశారు. వైసీపీలో చేరిన వారిలో కరణం కనకారావు, దాసరి హరీష్, గేదెల లక్ష్మణరావు, కరణం దుర్గా రావు, వసంత రమణ, వాసపల్లి రాజు. నీలకాయల అప్పలరాజు, మడకల గోవిందరావు పెద్దింటి రామకృష్ణ, గొర్లి శివకుమార్ ఉన్నారు.

అన్నదానం మహా పుణ్యఫలం

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: అన్నదానం మహా పుణ్యఫలం అని దక్షిణ నియోజకవర్గం తెలుగుదేశం జనసేన బిజెపి ఉమ్మడి అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. గురువారం ఎ వి.యన్ కాలేజ్ డౌన్, సున్నపు వీధిలో జరిగిన బాపన ముత్యాలమ్మ అమ్మవారి పండుగ సందర్భంగా మహా అన్నదానం ప్రారంభించారు. భక్తులకు ఆయనే స్వయంగా వడ్డించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారి దయ ఉంటే అన్నీ ఉన్నట్టేనని, అందరూ ,సుఖశాంతులతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నిర్వాహకులు, గ్రామ కమిటీ, స్థానిక కూటమి పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన వైసీపీ నేతలు

విశాలాంధ్ర - భీమిలి: వైసిపికి చెందిన మండలంలోని తాళ్లవలస గ్రామ పంచాయితీ 12వ వార్డు సభ్యులు రవ్వ రాంబాబు గురువారం టిడిపి లో చేరారు. స్థానిక గంటా శ్రీనివాసరావు క్యాంప్ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షులు డిఎవన్ రాజు సమక్షంలో పార్టీలో చేరారు. కండువా వేసి పార్టీ లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు బిఎస్ఎన్ రాజు, ఎంపిటిసి సభ్యులు కోరాడ రమణ, నాయకులు డి.వేణురాజు, గొలగాని రమణ పాల్గొన్నారు.

ప్రయాణ ఔత్సాహికుల కోసం ఎస్‌బీఐ కార్డ్ మైల్స్ ప్రారంభం

విశాలాంధ్ర -విశాఖ సిటీ: భారతదేశపు అతిపెద్ద ప్యూర్-ప్లే క్రెడిట్ కార్డ్ జారీచేసే సంస్థ అయిన ఎస్‌బీఐ కార్డ్, తన మొదటి ట్రావెల్-ఫోకస్డ్ కోర్ క్రెడిట్ కార్డ్, 'ఎస్‌బీఐ కార్డ్ మైల్స్ ' యొక్క మూడు వేరియంట్‌లను ఈరోజు ప్రారంభించింది. ఈ కార్డ్ అన్ని రకాల ప్రయాణీకులకు సంపూర్ణ ప్రయాణ ప్రయోజనాలను అందిస్తున్నట్టు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చైర్మన్ దినేష్ కుమార్ ఖరా తెలిపారు. ఎస్‌బీఐ కార్డ్ మైల్స్ ట్రావెల్ క్రెడిట్‌లను ఎయిర్ మైల్స్, హోటల్ పాయింట్‌లుగా మార్చడం, ప్రతి ట్రావెల్ బుకింగ్‌పై వేగవంతమైన రివార్డ్‌లు ఎయిర్‌పోర్ట్ లాంజ్ యాక్సెస్ వంటి ఇతర అద్భుతమైన ఫీచర్‌లను అందిస్తుందన్నారు. రిడెంప్షన్ యొక్క సంపూర్ణ ఎంపికతో కార్డ్ హోల్డర్‌లను ఎంపవర్ చెయ్యడం, ఎయిర్ విస్తారా, ఎయిర్ ఇండియా, స్పైస్‌జెట్, ఎయిర్ ఫ్రాన్స్-కే ఎల్ ఎం, ఎతిహాద్ ఎయిర్‌వేస్, ఎయిర్ కెనడా, థాయ్ ఎయిర్‌వేస్, క్వాంటాస్ ఎయిర్‌వేస్, ఐ టీ సీహోటల్స్, ఐ హెచ్ జే హోటల్స్ %ః% రిసార్ట్‌లతో సహా 20 పైగా ఎయిర్‌లైన్ ఇతర హోటల్ బ్రాండ్‌లకు ఎస్ బీ ఐ కార్డ్ భాగస్వాములుగా ఉన్నారన్నారు.

పే కర్నే కా స్మార్టర్ వే కాంపైన్‌తో అమేజాన్ పే

విశాలాంధ్ర -విశాఖ సిటీ: అమేజాన్ పే వారి సరికొత్త కాంపైన్ 'పే కర్నే కా స్మార్టర్ వే', రోజూవారీ లావాదేవీలకు తెలివైన విధానం దిశగా మార్పును సూచిస్తుంది. ఇది అమేజాన్ పే వారి వేగం, సౌకర్యాలను చూపిస్తుంది, తక్కువ కాంతిలో కూడా ఏదైనా క్యూఆర్ ను స్కానింగ్ చేయడానికి ఆటో ఫ్లాష్, ఏ యాప్ నుండైనా ఏదైనా యూపీఐ ఐడీకి డబ్బు పంపించడం, అమేజాన్ పే బ్యాలెన్స్ ను వాడినప్పుడు వేగవంతంగా చెల్లింపులు చేయడం, వేగంగా రిఫండ్స్ అందచేయడం వంటి కొత్త ఫీచర్స్ కు ఇది ప్రాధాన్యతనిస్తోంది. కస్టమర్స్ అందరికీ 24/7 మద్దతునిస్తుంది, తెలివైన చెల్లింపు విధానంగా దీనిని మార్చింది. విలక్షణ బాలీవుడ్ నటుడు ఆయుష్మాన్ ఖురానా మద్దతుతో, నిరంతరంగా రోజువారీ లావాదేవీలు చేయడానికి అమేజాన్ పేని ప్రాధాన్యతనిచ్చిన ఎంపికగా తెలియచేసే, యూజర్స్ కు ఇబ్బందిరహితమైన మరియు బహుమానపూర్వకమైన చెల్లింపు అనుభవాన్ని వాగ్దానం చేసే లక్ష్యాన్ని కాంపైన్ కలిగి ఉంది.

శామ్‌సంగ్ ఇన్నోవేషన్ క్యాంపస్' రెండవ సీజన్ ప్రారంభం

విశాలాంధ్ర- విశాఖ సిటీ: శామ్‌సంగ్, భారతదేశపు అతిపెద్ద వినియోగదారు ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ సాంసంగ్ ఏఐ, ఐఓటీ, బిగ్ డేటా కోడింగ్ %ః% ప్రోగ్రామింగ్ వంటి భవిష్యత్తు-టెక్ డొమైన్‌లలో యువతకు నైపుణ్యాన్ని పెంపొందించడానికి రూపొందించబడిన దాని జాతీయ నైపుణ్య కార్యక్రమం - శామ్‌సంగ్ ఇన్నోవేషన్ క్యాంపస్ - రెండవ సీజన్‌ను ప్రారంభించింది. శామ్‌సంగ్ ఇన్నోవేషన్ క్యాంపస్ 18-25 సంవత్సరాల వయస్సు గల యువతకు భవిష్యత్ సాంకేతికతలలో నైపుణ్యాన్ని పెంపొందించడం వారి ఉపాధిని మెరుగుపరచడం లక్ష్యంగా పెట్టుకుందని సాంసంగ్ ప్రతినిధి జె.బి.పార్క్ అన్నారు.

రియల్ మీ నార్జో 70 సిరీస్ 5 జి విడుదల

విశాలాంధ్ర/విశాఖపట్నం: నమ్మకమైన స్మార్ట్‌ఫోన్ సంస్థ రియల్ మీ గురువారం రియల్ మీ నార్జో 70 సిరీస్ 5 జిని ప్రవేశ పెట్టింది. ఇది రియల్ మీ నార్జో వరుసలో ఒక ఒక కొత్త రకం. ఈ సిరీస్ రెండు బ్రేక్ త్రూ రియల్ మీ నార్జో 70 ఎక్స్ 5 జి, రియల్ మీ నార్జో 70 5 జి లతో మొదలుపెట్టబడినది. రియల్ మీ నార్జో సిరీస్ అనేది మెరుగైన వినియోగదారుని అనుభవాన్ని అందించే ఒక స్టైలిష్ స్మార్ట్‌ఫోన్. దీనికి ఇండియా లో సుమారు 16 మిలియన్ కన్నా ఎక్కువ వినియోగదారులు ఉన్నారు. ఈ రియల్ మీ నార్జో సిరీస్ స్మార్ట్‌ఫోన్ టెక్నాలజీ ని మెరుగుపరుస్తుంది.ఈ పరికరాలు ఆధునిక టెక్నాలజీ తో, ప్రీమియం ఫీచర్స్ తో, వినియోగదారులని ట్రెండ్ ని అనుసరించడంలో ముందు ఉండేలా దాని విభిన్న స్టైల్ ని తెలియజేసే విధంగా రూపొందాయి. రియల్ మీ నార్జో 70 సిరీస్ 5 జి ని లాంచ్ చేయడం చాలా సంతోషంగా ఉందని రియల్ మీ వ్యాఖ్యాత అన్నారు. రియల్ మీ నార్జో 70 ఎక్స్ 5 జి 5000 ఎం ఏ హెచ్ పెద్ద బ్యాటరీ తో వస్తుంది. అది 45 డబ్ల్యూ సూపర్ వూక్ చార్జ్ కి మద్దతు ఇస్తుంది. ఇది ఎక్కువ కాలం బ్యాటరీ ని అందిస్తుంది. 120 హేట్జ్ అల్ట్రా మృదువైన డిస్ప్లే విభిన్న రంగులను,మెరుగైన విభిన్న రంగులను అందిస్తుంది. మెరుగైన విజువల్ అనుభవాన్ని అందిస్తుంది.

రిలయన్స్ జ్యువెల్స్ వింధ్య కలెక్షన్ ఆవిష్కరణ

విశాలాంధ్ర/విశాఖపట్నం: భారతదేశపు ప్రముఖ ఆభరణాల బ్రాండ్ రిలయన్స్ జ్యువెల్స్ ఈ సంవత్సరం అక్షయ తృతీయ రోజున వింధ్య కలెక్షన్‌ను ప్రవేశపెట్టడం ద్వారా ప్రత్యేకమైన, అద్భుతమైన కలెక్షన్లతో పండుగలను జరుపుకునే సంప్రదాయాన్ని కొనసాగిస్తోంది. 'జ్యువెల్స్ ఆఫ్ ఇండియా' కలెక్షన్ సిరీస్‌లో తొమ్మిదోదైన వింధ్య మధ్యప్రదేశ్లోని గొప్ప కళా సంప్రదాయాల నుంచి ప్రేరణ పొందింది. వారణాసిలోని రిలయన్స్ జ్యువెల్స్ స్టోర్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఫ్యాషన్ ఐకాన్, బాలీవుడ్ దివా దిశా పటానీ ప్రత్యేక ఫెస్టివల్ కలెక్షన్‌ను ఆవిష్కరించారు. హిందూ సంస్కృతిలో శ్రేయస్సు, సమృద్ధిని సూచించే పవిత్ర పండుగ అక్షయ తృతీయ, ఆభరణాలు కొనడానికి సరైన సందర్భమిది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని రిలయన్స్ జ్యువెల్స్ వింధ్య కలెక్షన్%ా% మధ్యప్రదేశ్ గొప్ప సాంస్కృతిక వారసత్వం, నిర్మాణ వైభవానికి నివాళి అర్పించే విధంగా అద్భుతమైన ఆభరణాల శ్రేణిని అందిస్తోంది. గ్వాలియర్ కోట, సాంచి స్థూపం, ఉజ్జయినిలోని మహాకాళేశ్వర్ ఆలయం, మితౌలి, బటేశ్వర్ దేవాలయాలు వంటి మధ్యప్రదేశ్లోని ప్రసిద్ధ కట్టడాల స్ఫూర్తితో ప్రతి నగను డిజైన్ చేసినట్లు రిలయన్స్ జ్యువెల్స్ సీఈవో సునీల్ నాయక్ తెలిపారు.

ఇండిపెండెంట్‌గా నామినేషన్ వేసిన ఏలూరు ధర్మావతి

విశాలాంధ్ర - ఆనందపురం: భీమిలి శాసనసభ ఎన్నికలకు స్వతంత్ర్య అభ్యర్థిగా ఆనందపురం మండలం బోయపాలెం గ్రామానికి చెందిన ఏలూరు ధర్మావతి భీమిలి లో ఎలక్షన్ అధికారికి నామినేషన్ పత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ ఏపార్టీని కించపరచాలని కానీ, వారిని అవమానించాలనీ కాదు అంటూ స్వతంత్ర్య అభ్యర్థిగా పోటీ చేస్తున్న సందర్భంగా పోటీ చేస్తున్న సందర్భంగా భీమిలి నియోజకవర్గం ప్రజలు అందరూ ఆదరించాలని ఒక్క ఛాన్స్ ఇస్తే భీమిలిని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్తానని అన్నారు.

గండి బాబ్జిని ఘనంగా సత్కరించిన ఎన్డీఏ నాయకులు

విశాలాంధ్ర - పెందుర్తి:తెలుగుదేశం పార్టీ పెందుర్తి అసెంబ్లీ నియోజకవర్గం ఇన్చార్జిగా నియమితులైన మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జిని ఎన్డీఏ కూటమి నాయకులు గురువారం సాయంత్రం ఘనంగా సత్కరించారు. సబ్బవరం మండల కేంద్రంలోని కన్వెన్షన్ హాల్లో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి జనసేన రూరల్ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్ బాబు, అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ నాయుడు సోదరుడసోదరుడు శ్రీనివాస నాయుడు, రాజేష్, బిజెపి నియోజకవర్గ కన్వీనర్ గొర్లే రాము నాయుడు, జీవీఎంసీ టిడిపి ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు, 97వ వార్డు కార్పొరేటర్ సేనాపతి శంకర్రావు, టిడిపి నాయకులు కరకదేముడు గండి దేముడి బాబు వేగి పరమేశ్వరరావు సహా బిజెపి జనసేన టిడిపి నాయకులు కార్యకర్తలు బాబ్జిని పూలమాలలతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో కేంద్రంలోనూ ఇటు రాష్ట్రంలోనూ ఎన్డీఏ ప్రభుత్వాలే అధికారంలోకి వస్తాయని, వైసీపీ పాలనలో నష్టపోయిన వ్యవస్థను చక్కదిద్దుతాయని పేర్కొన్నారు.